క్లుప్తంగా

వెల్లబాడు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా వందనం



వేమూరు (కొల్లూరు): గ్రామ స్థాయి వైఎస్సార్‌సీపీ కమిటీల ఎంపికలో భాగంగా మండలంలోని వెల్లబాడు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నన్నెపాగ వందనం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అధ్యక్షతన జరిగిన గ్రామ కమిటీ ఎన్నికలో వందనంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ క్రియాశీలక నాయకులు, కార్యకర్తల సమక్షంలో జరిగిన ఎంపికలో ఏకగ్రీవంగా ఎన్నికైన వందనం మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి అప్పగించిన పదవికి న్యాయం చేస్తూ పార్టీ బలోపేతానికి పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి పదవిని కేటాయించిన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి వెల్లబాడు బుల్లయ్య, వైఎస్సార్‌సీపీ వేమూరు, భట్టిప్రోలు కన్వీనర్‌లు దాది సుబ్బారావు, పడమట శ్రీనివాసరావు, జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ



భట్టిప్రోలు (కొల్లూరు) : పేదలకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు, అట్టలు పంపిణీ కార్యక్రమం మంగళవారం భట్టిప్రోలులో నిర్వహించారు. చేనేత వస్త్ర వ్యాపారి పాలకుర్తి సీతారామయ్య జ్ఞాపకార్థం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమార్తె మానేపల్లి లక్ష్మి సరోజని సహకారంతో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



నిజాంపట్నం: ఇటీవల నిజాంపట్నం హార్బర్‌లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని ప్రమాద బాధితులకు మంగళవారం పలువురు దాతలు చేయూతనిచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మూడు కుటుంబాల బాధితులకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వస్త్రాలు, నగదును అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కాళ్ళేపల్లి గౌరీశంకర్, జాయింట్ సెక్రటరీ దబ్బకూటి బసవరాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, నాయకులు పీతా సాయిబాబు, మీరయ్యలు బాధితులకు దుస్తులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయుడు గోపీ, వెంకటేశ్వరరావు, గంగరాజు, సునీల్, సుందరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై అదాలత్




తెనాలిరూరల్: విద్యుత్ శాఖకు సంబంధించిన వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సీజీఆర్‌ఎఫ్ పని చేస్తుందని ఆ ఫోరం చైర్మన్ ఎం. విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. స్థానిక ఓవర్ బ్రిడ్జి వెంబడి ఉన్న ఎస్‌ఎల్‌ఎస్ ఫంక్షన్ హాలులో విద్యుత్తు అదాలత్ అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. విజయవాడకు చెందిన కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ అదాలత్ కార్యక్రమంలో వినియోదారులిచ్చిన 20 ఫిర్యాదులను పరిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఫోరం చైర్మన్, ఫోరం సభ్యులు, అలాగే గుంటూరు జిల్లా విద్యుత్ ఎస్‌ఈ కేవీఎఎస్ మూర్తి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రామిరెడ్డి, తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవి ఆధ్వర్యంలో జరిగింది. విద్యుత్ వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా.. లో వోల్టేజీ, మీటర్లు డిఫెక్ట్, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ బిల్లులు, ట్రాన్స్ ఫారంలు,లో వోల్టేజీ ,హై వోల్టేజీ వంటి అనేక సమస్యలు రాగా వాటిని వెంటనే పరిష్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి నిరోధక విభాగం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా వేణుగోపాల్

గుంటూరు రూరల్: రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గుంటూరు నగరానికి చెందిన అన్నంగి వేణుగోపాల్‌ను నియమిస్తూ నియామక ఉత్తర్వులను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మదిరే రంగసాయిరెడ్డి జారీ చేశారు.

సాగునీటి వంతెనలు.. కూలితే తప్పదు ముప్పు

- ఆర్ అండ్ బీ వంతెన ప్రతిపాదనలు బుట్ట దాఖలు
- వంతెనలు కూలితే సాగు నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు
- లంక గ్రామాల ప్రజల రాకపోకలకు అవస్థలు



బలహీనంగా తయారైన పశ్చిమ బ్యాంక్ కెనాల్ సాగునీటి సరఫరా వంతెన



శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా తయారైన పడవల కాలువ వంతెన

కొల్లూరు: పరిమితికి మించిన బరువులతో నిబంధనలు వీడి వాహనాల రవాణా.. పాత కాలవు వంతెనలను కూలదోస్తున్నాయి. నీటి పారుదల జరపడానికి ఏర్పాటు చేసిన లాకుల వ్యవస్థ కాస్తా రోడ్డు రవాణా మార్గాలుగా మారిపోవడంతో బ్రిటీష్ కాలం నాటి వంతెనలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నీటి పారుదల శాఖాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లాకుల వంతెనల పరిస్థితి అధ్వానంగా తయారయింది. గతంలో నీటి పారుదలకు నిర్మించిన వంతెనలు, కరకట్టలపై వాహనాల రాకపోకలకు అనుమతులు ఉండేవి కావు. ప్రస్తుతం మితిమీరిన లోడ్‌తో వాహనాలు తిరుగుతున్నా అధికారులకు మాత్రం పట్టడం లేదు. సాగునీటి సరఫరాకు ప్రధానంగా ఉన్న కొల్లూరు పశ్చిమ బ్యాంక్ కెనాల్ వంతెన గోడ 2012లో కూలడంతో వంతెన మనుగడ అప్పట్లోనే ప్రశ్నార్థకంగా తయారైంది. వాహనాల రాకపోకలకు ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేకంగా వంతెనలు నిర్మించాల్సి ఉన్నా పట్టనట్లు వ్యవహరిస్తుండటం నీటిపారుదల శాఖకు తలనొప్పిగా మారింది.

కూలితే రోడ్డు మార్గం కట్

నీటి పారుదలకు ప్రధానంగా ఉన్న పశ్చిమ బ్యాంక్ కెనాల్ వంతెన, పడవల వంతెనలు ధ్వంసం అయితే బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన సుమారు 8 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్న 13 లంక గ్రామాలకు రోడ్డు మార్గం లేకుండా పోతుంది. నీటి పారుదల శాఖాధికారులు వంతెనపై సుమారు ఆరడగుల ఎత్తున పేరుకుపోయిన మట్టిని తొలగించి మరమ్మతులు జరిపి భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. స్థానికులు, ఇటుక ఉత్పత్తిదారులు ఆందోళనకు దిగడంతో 8 టన్నులకు మించిన వాహనాలు రాకూడదన్న ఆంక్షలతో రాకపోకలకు అనుమతించారు. అయితే వంతెన పరిస్థితి మరింత అధ్వానంగా మారడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలల బస్సులు ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉండటంతో ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం తల్లిదండ్రులను వెంటాడుతుంది.

సాగు నీటి సరఫరాకూ ఇక్కట్లు

సాగు నీటి పారుదలకు గుంటూరు జిల్లా పిడపర్తిపాలెం లాక్‌ల తరువాత కొల్లూరు లాక్‌లు మాత్రమే ప్రధానమైనవి. ఈ వంతెనల పరిస్థితి బలహీనంగా మారుతుండటంతో సాగు నీటి సరఫరాకు సైతం ఇక్కట్లు ఎదురయ్యే ప్రమాదం ఉంది. వంతెనలు దెబ్బతింటే సుమారు 25,608 ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొల్లూరు పశ్చిమ బ్యాంకు కెనాల్ నుంచి వరహాపురం చానల్ ద్వారా 7,442 ఎకరాలు, దోనేపూడి కాల్వ ద్వారా 5,146, కొల్లూరు సైడ్ చానల్ ద్వారా 2,042, కొల్లూరు బ్రాంచి ద్వారా 567, కొల్లూరు నార్త్ సైడ్ చానల్ ద్వారా 3,019, క్రాప బ్రాంచి ద్వారా 842, చినపులివర్రు కాల్వ ద్వారా 702 ఎకరాల ఆయకట్టుకు నీటి పంపిణీ చేపట్టాల్సి ఉంది. ఈ వంతెనలకు ముప్పు వాటిల్లకుండా తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరతున్నారు.

ప్రతిపాదనలు ఏమయినట్లో

కొల్లూరు లాక్ సెంటర్ నుంచి పశ్చిమ బ్యాంకు కెనాల్ వరకూ మూడు కాల్వలను కలుపుతూ ఒకే వంతెన నిర్మించేందుకు ఆర్ అండ్ బీ శాఖాధికారులు గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి స్థల సేకరణకు సర్వే నిర్వహించారు. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు రవాణాకు ప్రత్యేక వంతెన నిర్మాణం మాత్రం మొదలు కాలేదు. ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవడంతో నీటి పంపిణీకి కీలకంగా ఉన్న వంతెనలు పనికిరాకుండా పోతున్నాయి. రాకపోకలకు రోడ్డు మార్గం ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు దారితీస్తుంది. గతంలో అప్పటి, ఇప్పటి సీఎం చంద్రబాబుకు, పలువురు ప్రజా ప్రతినిధులకు స్థానికులు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోవడంతో స్థానికంగా అసంతృప్తి వ్యక్తమవుతుంది.



పశ్చిమ బ్యాంక్ కెనాల్ వంతెన అడుగు భాగంలో పెచ్చులు ఊడి తుప్పు పట్టిన ఇనుప చువ్వలు (ఫైల్)

విద్యార్థులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలి

పట్టణ సీఐ మల్లికార్జునరావు



రేపల్లె రూరల్: విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని పట్టణ సీఐ మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూలులో మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలని చెప్పారు. క్రమశిక్షణ, ఏకాగ్రతలు కలిగి ఉంటే లక్ష్యాలను సునాయాసంగా చేరుకోవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. ఆధునిక సాంకేతికతను అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడరాదని, పరిచయం లేని వ్యక్తులు తినుబండారాలు ఇస్తే తీసుకోరాదని, వెంటనే తల్లిదండ్రులకుగానీ, ఉపాధ్యాయులకుగానీ తెలియజేయాలని అన్నారు. అనంతరం చిన్నారులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణ, స్కూల్ అధ్యక్షుడు డాక్టర్ మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వకర్త డాక్టర్ గణేష్

చెరుకుపల్లి (రేపల్లె రూరల్): వైఎస్సార్‌సీపీ బలోపేతానికై గ్రామ స్థాయి నుంచి శక్తివంచన లేకుండా పని చేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో నిజాంపట్నం మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టించి పనిచేసే వారికి పార్టీ అధిష్ఠానం గుర్తించి సముచిత స్థానం కలిపిస్తుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిని, సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, ప్రస్తుత టీడీపీ పాలనలో చోటు చేసుకుంటున్న అవినీతిని, కుంటుబడిన సంక్షేమాన్ని వివరించాలని సూచించారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో గెలుపు బావుటా ఎగురవేయటం తథ్యమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో నిజాంపట్నం మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏవో సుమంత్‌కుమార్

ఏవో సుమంత్‌కుమార్



మినుము పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారి లోకేశ్వరి



మొక్కజొన్న పంటను పరిశీలించి సూచనలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు



మంత్రిపాలెంలో మినుము పంటను పరిశీలిస్తున్న ఏవో రమేష్‌బాబు

కర్లపాలెం: రబీ సీజన్‌కు పైర్లు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని కర్లపాలెం మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ చెప్పారు. మండల పరిధిలోని తుమ్మలపల్లి, పెదగొల్లపాలెం గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ పంట నమోదు చేయించుకోవటంతో పాటు ఈ కేవైసీ చేయించుకోవాలని చెప్పారు. రబీ పంటలలో కలుపు మొక్కలను సమూలంగా నిర్మూలించుకోవాలన్నారు. కలుపు నివారణకు టార్గా సూపర్ లేదా పార్సుట్ మందును పిచికారీ చేయాలని సూచించారు. కలుపు మందు పిచికారీ చేసిన వారం వరకు ఎలాంటి ఎరువులు వేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకులు శివనాగరాజు, శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి

వేమూరు (కొల్లూరు) : రబీలో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న పంటలలో వ్యాపించే తెగుళ్ల నివారణపై రైతాంగం దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖాధికారి చందవోలు సునీత అన్నారు. మంగళవారం మండలంలోని జంపని, వేమూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జొన్న, మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎరువులను తగిన మోతాదులో వాడటం వల్ల రైతులకు పెట్టుబడుల భారం తగ్గుతుందన్నారు. జొన్న, మొక్కజొన్నలో వ్యాపించే కత్తెర, ఎండు తెగుళ్లు, రబ్బరు పురుగు నివారణ, కలుపు నివారణకు పిచికారీ చేయాల్సిన మందుల గురించి వివరించారు. రైతులు పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మోతాదులో, సిఫార్సు చేసిన మందులను మాత్రమే వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

అపరాల సాగులో సస్యరక్షణ చేపట్టాలి

అమృతలూరు (కొల్లూరు): రబీలో సాగు చేసిన అపరాల పంట అయిన మినుములో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతోపాటు, తగిన సమయంలో నీటి తడులు అందించాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఉయ్యూరు లోకేశ్వరి అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోవాడ, యలవర్రు గ్రామాలలో మినుము పంటను ఆమె పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ప్రస్తుతం మినుము 30 రోజుల నుంచి 45 రోజుల దశలో ఉన్నందున రైతులు బూడిద తెగులు, పూతకు ఆశించే మారుకా మచ్చల పురుగుల ఉధృతిని గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పంటకు 35 రోజులలోపు తేలికపాటి నీటి తడిని అందించాలని సూచించారు. రబీలో పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వీఏఏలు బి.సాయిమణికుమార్, ఎస్.ప్రవల్లిక పాల్గొన్నారు.

మినుము పంటను తెగుళ్ల నుంచి కాపాడుకోవాలి

నగరం: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి రమేష్‌బాబు చెప్పారు. మండలంలోని మంత్రిపాలెం, అల్లపర్రు గ్రామాలలో మంగళవారం వ్యవసాయాధికారులు పర్యటించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ మినుము పంటను తెగుళ్ల బెడద నుంచి కాపాడుకోవాలన్నారు. ప్రస్తుత సమయంలో మారుకా మచ్చల పురుగు ఆశిస్తుందన్నారు. పూత, పిందె దశలో ఈ పురుగు ఆశించి అపార నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె 5 మి.లీ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నాగశ్రీనివాస్, వీఏఏలు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో ఏబీఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రవిచంద్ర కుమార్ తదితరులు

రేపల్లె రూరల్: ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గణతంత్ర వేడుకలలో నిర్వహించిన కవాతులో రేపల్లె పట్టణానికి చెందిన ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంగళవారం స్థానిక కళాశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవిచంద్ర కుమార్ మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం రోజున తమ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ఎం.సుప్రియ (బీఎస్సీ తృతీయ సంవత్సరం), పి.గాయత్రీ (బీఎస్సీ ద్వితీయ సంవత్సరం), బి.నాగరాజు (బీకాం ద్వితీయ సంవత్సరం) పాల్గొని ప్రతిభను చాటారన్నారు. కవాతులో అవకాశం అరుదుగా లభిస్తుందని, తమ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనటం అభినందనీయమన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ఎన్‌సీసీ కేర్ టేకర్ కె.బాలగురవయ్య, 22వ ఆంధ్రా బెటాలియన్ పీఐ స్టాఫ్, రామరాజు, అనంత సింగ్ తదితరులున్నారు.

ప్రయాణం కారాదు ప్రాణాంతకం

జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమారి



వాహన చోదకులకు సూచనలిస్తున్న ఎంవీఐ ప్రసన్నకుమారి

కొల్లూరు : వాహన చోదకులు రహదారి భద్రతా ప్రమాణాలను పాటించి ప్రయాణం ప్రాణాంతకం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందని జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) పి.ప్రసన్నకుమారి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం కొల్లూరు ఎంప్లాయిస్ రిక్రియేషన్ హోమ్‌లో వాహన చోదకులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లారీ, ట్రాక్టర్, ఆటోల యజమానులు నిర్లక్ష్యం వహించకుండా తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన పత్రాలను సక్రమంగా ఉండేలా జాగ్రత్త పడాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతోపాటు, సెల్ ఫోన్‌లో మాట్లాడకుండా ఉండాలన్నారు. వాహన చోదకులు రహదారిపై ఇష్టానుసారం వాహనాలను నడపకుండా రోడ్డుకు ఎడమవైపున మాత్రమే వాహనాలను నడిపిన పక్షంలో ప్రమాదాలను నివారించడానికి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించినా ఎదుటి వారు నిబంధనల మేరకు నడుచుకోని పక్షంలో ప్రమాదాలు చోటుచేసుకొని ప్రాణాలు పోవడానికి ఆస్కారం ఎక్కువ ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లు టేప్ రికార్డర్లలో అధిక సౌండ్‌లు పెట్టి రాకపోకలు సాగించడంతో ఎంతో మంది ఇబ్బందులుకు గురవడంతోపాటు, ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ సహకరించిన పక్షంలో, తమ సహకారం సైతం వాహనాల యజమానులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోటర్ వెహికల్స్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పి.అంకమ్మరావు, కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు, డాక్టర్ నరేంద్ర, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మశాసన విధివిధాన పత్రిక మంజూరు

పొన్నూరు: పట్టణంలోని అవ్వారు బురయ్య ధర్మ సత్రం అనువంశిక ధర్మకర్త అవ్వారు వెంకట సాంబశివరావు చేసుకున్న విన్నపానికి దేవదాయ శాఖ అధికారులు స్పందించారు. అనారోగ్యం కారణంగా ధర్మ సత్రం అనువంశిక ధర్మకర్తగా తాను కొనసాగలేనని, తన స్థానంలో వేరొకరు హక్కులు పొందేందుకు అవసరమైన ధర్మశాసన విధి విధాన పత్రిక కోసం ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌లో సాంబశివరావు అర్జీ దాఖలు చేశారు. స్పందించిన ఎండోమెంట్ అధికారులు ధర్మశాసన విధి విధాన పత్రికను సాంబశివరావుకు మంజూరు చేశారు. మంగళవారం పొన్నూరులోని ఆయన నివాసంలో దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి భవాని ప్రసాద్ పత్రికను అందజేశారు.

31న కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

తెనాలిఅర్బన్: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన సత్రం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 31న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బోసురోడ్డులోని దేవస్థానంలో ఆత్మార్పణ దినోత్సవానికి సంబంధించిన బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 5.30 గంటలకు విఘ్నేశ్వరుని పూజ, 6.15 గంటలకు వైశ్య పతకావిష్కరణ జరుగుతాయని చెప్పారు. 8 గంటలకు 102 గోత్రముల ఆర్యవైశ్య కన్యలచే, కలశలతో శోభాయాత్ర, 8.30 గంటలకు హోమం, 10.30 అభిషేకం, అలంకరణ, అర్చనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు ప్రజ్ఞానంద సరస్వతీ (బాలస్వామిజీ) పర్యవేక్షణలో అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆర్యవైశ్య కుటుంబ సభ్యులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ వాసవీ మాత కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కోటిజేటి గోపీకృష్ణ, గ్రంథి వెంకట విశ్వేశ్వరరావు, నందం రజనికుమార్, వుప్పల వరదరాజులు, మువ్వాల శ్రీనివాసరావు, అమ ర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓంకార నాదంపై సత్సంగం

రేపల్లె రూరల్: పట్టణంలోని రింగురోడ్డు వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఈ నెల 29వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ఓంకార నాదంపై సత్సంగం నిర్వహించబడునని నిర్వాహకులు కోడె గౌరీశంకర్, ఎంబీఎల్ నారాయణమూర్తిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమిత్రానంద సరస్వతి మాతాజీ ఓంకార నాద విశిష్టతను వివరిస్తారని, ఆసక్తి కలిగిన పరిసర ప్రాంత ప్రజలు హాజరుకావాలని కోరారు.

రేపు జాబ్ మేళా

రేపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన పట్టణంలోని ఇసుకపల్లి శారద ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాల్గెట్, డైకిన్, బ్లూస్టార్, తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, 100 ఖాళీలు వరకు భర్తీ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్హతను బట్టి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనం అందజేయబడునన్నారు. ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, విద్యార్హత సర్టిఫికెట్‌లు, ఆధార్ జిరాక్స్‌లతో పాటు పాస్‌పోర్ట్ ఫొటోలతో రావాలన్నారు. పూర్తి వివరాలకు 90323 84374 నంబరును సంప్రదించాలన్నారు.

జూదరుల అరెస్ట్

చందోలు(కర్లపాలెం): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చందోలు ఎస్ఐ ఆర్.స్వామిశ్రీనివాస్ చెప్పారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని అల్లూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఎస్ఐ తన సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వివాహిత మృతిపై బంధువుల ఆగ్రహం



డీఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పావని బంధువులు

తెనాలిరూరల్: తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మంగళగిరి మండలం ఎర్రబాలెంకు చెందిన గాజుల పావని మృతి చెందిందంటూ బంధువులు ఆందోళనకు దిగారు. 32 ఏళ్ల పావని ఈ నెల 24వ తేదీన గుంటూరు జిల్లా తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. అయితే ఆపరేషన్ వికటించి గాజుల పావని మృతి చెందిందని బంధువులు మంగళవారం తెనాలి డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఆపరేషన్ సమయంలో చిన్న పేగుకు, యూరినరీ బ్లాడర్‌కు గాయం చేసి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు ఆరోపించారు. పావని శరీరం ఒక్క రోజు వ్యవధిలోనే విషతుల్యమై షాక్‌లోకి వెళ్లిందని వాపోయారు. వెంటనే గుంటూరు ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేక మృతి చెందిందని, ఆపరేషన్ చేసిన డాక్టర్‌పై చర్యలు తీసుకుని, మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని డీఎస్పీ కార్యాలయం వద్ద నినాదాలతో డిమాండ్ చేశారు. ఇదే విషయమై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం అర్ధ రాత్రి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం ధర్నా అనంతరం కొంత సమయానికి అటు వైద్యులు, మృతురాలి బంధువుల మధ్య చర్చలు జరిగి పరస్పర అంగీకారానికి వచ్చారు. దీంతో ధర్నా విరమించారు. కాగా పావని మృతి విషయమై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది.

ఆధ్యాత్మిక చింతనతో జీవించండి



తెనాలిఅర్బన్: ఆధ్యాత్మిక చింతనతో మహిళలు జీవించాలని రక్షణసైన్యం చర్చి ప్రతినిధి కల్నల్ సుమిత్ర మాసి పేర్కొన్నారు. ఐతానగర్‌లోని రక్షణ సైన్యం ప్రార్థన మందిరంలో మంగళవారం స్త్రీలకూడిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలు జ్ఞానం కలిగి ప్రార్థన శక్తిని కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో లెఫ్టినెంట్ కల్నల్ సీయోను కుమారి, మేజర్లు రత్నసుందరీ, రాజాకుమారి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.